క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రత్యేక కృషితో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న దావు రాజ్యలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు శుక్రవారం మంత్రి తనయుడు జోగి రాజీవ్ అందజేశారు. గూడూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన రాజ్యలక్ష్మి గుండెకు సంబంధించి అరుదైన వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని, కుటుంబ పరిస్థితిని మంత్రి జోగి రమేష్ దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకువచ్చారు. మంత్రి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి తెలియజేయడం ద్వారా సీఎం కార్యాలయం నుంచి రూ.2.50 లక్షలకు సంబంధించి తక్షణ వైద్య సహాయంగా ఎల్‌ఓసీని మంజూరు చేశారని రాజీవ్ వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రి జోగి రమేష్ పర్యటన

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 10.30 గంటలకు కూడూరు గ్రామం నుంచి కృష్ణాపురం వరకు రూ.70 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు భారీ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొంటారు. పెనుమల్లి గ్రామంలో రూ.58.57 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను 11.30 గంటలకు ప్రారంభిస్తారు. గ్రామ సచివాలయం వద్ద స్వామిత్వలో భాగంగా నేలకొండపల్లి గ్రామ ప్రజలకు మంజూరైన పట్టాలను 11.45 గంటలకు పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పెనుమల్లి గ్రామంలోని విజయకృష్ణా కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతలతో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కొప్పెల్లి సచివాలయం పరిధిలోని ముచ్చర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

పెన్షనర్లకు సన్మానం



పెడన: పెన్షనర్లలోని సీనియర్ సిటిజన్లకు సత్వర సేవలు అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పెడన స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ కె. వీరవసంతరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం బ్యాంక్‌లో స్టేట్ బ్యాంక్ పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి బ్యాంక్ మేనేజర్ వీరవసంతరావు మాట్లాడుతూ సహాయ సహకారాలు కావాలంటే నేరుగా కలిసి ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పెన్షనర్లు జ్యోతి, ఫణిభూషణరావు, వీరభద్రస్వామి తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు మట్టా రాధాకృష్ణమూర్తి, రాము, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవన నిర్మాణాల పరిశీలన



కొక్కిలిగడ్డ(మోపిదేవి): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పక్కా భవనాలు నిర్మిస్తోంది. దీనిలో భాగంగా మండలంలో 12 గ్రామ సచివాలయాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఇప్పటికే కొన్ని చోట్ల పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగి ప్రారంభానికి సిద్ధం కాగా, మరికొన్ని చోట్ల శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని పంచాయతీరాజ్ ఏఈ బి. శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. మోపిదేవి గ్రామ సచివాలయం–1, పెదప్రోలు, పెదకళ్లేపల్లి–2, నాగాయతిప్ప, కోసూరువారిపాలెం, కొక్కిలిగడ్డ, కె. కొత్తపాలెంలో నిర్మాణాలు పూర్తికావచ్చాయని, అక్టోబర్ నెలాఖరులో వీటిని ప్రారంభిస్తామని వివరించారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి. ప్రభాకర్, కాంట్రాక్టర్ బడే రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



బందలాయిచెరువు వద్ద నిండుగా ప్రవహిస్తున్న నాగాయలంక పంట కాలువ



నాగాయలంక మండలం మర్రిపాలెం వద్ద వరి పొలం

- చివరి భూముల్లో వరి నాట్ల పనులు ముమ్మరం
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు
- జిల్లాలో చల్లపల్లిలో అత్యధికంగా 95.6 మి.మీ వర్షపాతం నమోదు

అవనిగడ్డ: దివిసీమలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు వరి పొలాలకు ఊరటనిచ్చాయి. సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షం ఎంతో సహాయ పడింది. వరుసగా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కోడూరు, నాగాయలంక మండలాల్లోని చివరి భూముల రైతులు వరినాట్ల పనులు ముమ్మరం చేశారు. కోడూరు మండలంలోని రామకృష్ణాపురం, ఇరాలి, ఊటగుండం, బసవానిపాలెం, ఉల్లిపాలెం, వేణుగోపాలపురం ప్రాంతాల్లో వరినాట్ల పనులు వేగవంతం చేశారు. ప్రతి ఏటా ఈ ప్రాంతంలో రైతులు వరినాట్లు ఆలస్యంగా చేస్తున్నారు. వర్షాలకు తోడు పంట కాలువకు సాగునీటి సరఫరా పెంచడంతో ఈ ప్రాంతంలో వరినాట్ల పనులు ఊపందుకున్నాయి. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లో పంటపొలాల్లో నీరు పడటంతో రైతులు కలుపుతీత పనులు చేపట్టారు. మరో రెండు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖాధికారులు చెబుతుండగా, ముసురు వరి పొలాలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కోడూరు మండలం వేణుగోపాలపురంలో దమ్ము పనులు

చల్లపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదు

కృష్ణా జిల్లాలోనే చల్లపల్లిలో శుక్రవారం అత్యధికంగా 95.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఘంటసాలలో 62.8, అవనిగడ్డలో 24.6, మోపిదేవిలో 20.2, నాగాయలంకలో 3.8, కోడూరులో అత్యల్పంగా 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం పలుచోట్ల కుండపోత వర్షం కురిసింది. పూర్తిస్థాయిలో సాగునీందక ఎదుగుదల లేని వరి పంటకు ఈ వర్షం జీవం పోసినట్లయింది.

కోడూరులో భారీ వర్షం

కోడూరు: కోడూరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం 6 గంటలకే ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీవర్స్ కాలనీ, అంబటి బ్రాహ్మణయ్య కాలనీ, యర్రారెడ్డివారిపాలెంతో పాటు పిట్టల్లంక, లింగారెడ్డిపాలెం, పోటుమీద, విశ్వనాథపల్లి గ్రామాల్లో వర్షం నీరు రహదారులపై నిలిచింది. భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వరి పంటకు జీవం పోస్తుందని అన్నదాతలు తెలిపారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జోగి రాజీవ్
- విద్యార్థులకు సైకిళ్ల అందజేత



ఎంపీపీ వాణితో కలిసి సైకిళ్లను అందజేస్తున్న జోగి రాజీవ్

పెడన: విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని మంత్రి జోగి రమేష్ తనయుడు, యువజన నాయకుడు జోగి రాజీవ్ అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 35 మంది బాలికలు, 28 మంది బాలురకు సైకిళ్లను శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై చూపుతున్న శ్రద్ధ మరచిపోలేనిదన్నారు. ఇప్పటికే ఇంగ్లిష్ మీడియంతో పాటు జగనన్న గోరుముద్ద, నాడు–నేడుతో పాఠశాలల ఆధునికీకరణ, బైజూస్ ద్వారా పాఠ్యాంశాల బోధన వంటివి ప్రవేశపెట్టారని చెప్పారు. తాజాగా ఐబీతో ఒప్పందం చేసుకోవడం ద్వారా నిరుపేద విద్యార్థులకు కూడా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ రాజులపాటి వాణి, నాయకులు నాగబాబు, అచ్యుతరావు, ట్రస్ట్ టీం లీడర్ ఎస్. రామాంజనేయులు, హెచ్‌ఎం సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'తో కాలనీల అభివృద్ధి

- పేర్ని కిట్టు
- సిమెంట్‌రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు పనుల ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, చిత్రంలో పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో నగరంలోని పలు కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 17వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో చేపట్టిన ఎనిమిది సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల పనులను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ నగరంతో పాటు గ్రామాల అభివృద్ధికి గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని రూపొందించారన్నారు. కార్యక్రమంలో భాగంగా గడప గడపకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం ద్వారా ప్రజల వ్యక్తిగత సమస్యలతో పాటు ఆయా కాలనీల సమస్యలను పరిష్కరించే వీలు కలుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ 17వ డివిజన్ ఇన్‌చార్జి పల్లపోతు చంద్రకుమారి, కార్పొరేటర్లు పర్ణం సతీష్, రాసంశెట్టి వాణిశ్రీ, తిరుమలశెట్టి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మొహమ్మద్ సాహెబ్, బూరగ రామారావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతి.. మనసా స్మరామి



కృత్తివెన్నులో వినాయకుడిని దర్శించుకుంటున్న ఉప్పాల రాము



పెడన బస్టాండ్ సమీపంలో భక్తుల పూజలు

పెడన: వినాయక చవితి వేడుకలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. ఆయా కూడళ్లలో పందిళ్ల వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెడన బస్టాండ్ సమీపంలోని గణపతి మందిరం వద్ద గణపతి నవరాత్రులు కొనసాగుతున్నాయి. గూడూరు రోడ్డులోని ఆటో స్టాండ్, కొలుకుల వారి వీధి, చోడుదిక్కుల వీధులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని పెనుమల్లి, చేవేంద్ర, చెన్నూరు తదితర గ్రామాల్లో సైతం గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దేవుని దయతో అందరూ సంతోషంగా ఉండాలి..

కృత్తివెన్ను: ఆ విఘ్నేశ్వరుని దయ అందరిపై ఉండాలని, ప్రజలంతా సంతోషంగా జీవించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, జిల్లా పరిషత్ చైర్మన్ హారిక భర్త ఉప్పాల రాము అన్నారు. శుక్రవారం ఆయన కృత్తివెన్నులో విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, పులగం రాము, పులగం శ్రీను, అడబాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు కూడళ్ల వద్ద కాలనీల్లో ఏర్పాటు చేసిన చిన్నా, పెద్ద గణనాథుని విగ్రహాలకు ఐదో రోజు పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలుచోట్ల గణనాథుని ప్రతిమల అలంకరణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

కృత్తివెన్ను: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని పలు గ్రామాలలో శుక్రవారం వినాయకుని ఊరేగింపులు ఘనంగా జరిగాయి. కృత్తివెన్ను, యండపల్లి, గుడిదిబ్బ గ్రామాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మేళతాళాలతో స్వామివారి విగ్రహాలను భక్తులు ఆనందోత్సాహాల నడుమ ఊరేగించి పంట కాలువలు, చెరువులు, సముద్ర జలాలలో నిమజ్జనం చేశారు. చిన్నారులు సైతం తాము ప్రతిష్టించిన విగ్రహాలను ఊరేగించి సందడి చేశారు.

గాంధీనగరంలోని అభయసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రులు ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి లడ్డూను గ్రామానికి చెందిన పెనుబోతు అనిల్, ప్రత్తి పవన్ శ్రీనివాస్‌లు రూ. 33,500లకు వేలంలో దక్కించుకున్నారు.


మోపిదేవి: మోపిదేవి నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామివారి ఆలయం వద్ద నెలకొల్పిన గణేశుని విగ్రహాన్ని శుక్రవారం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఐదు రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథుని మోపిదేవి వార్పు వద్ద సాయంత్రం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఉదయం వినాయకుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో సందడిగా గ్రామోత్సవం నిర్వహించారు.



మోపిదేవిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణేశుడు



బుజ్జి గణపయ్యను నిమజ్జనానికి తీసుకువెళ్తున్న చిన్నారులు



పరాసుపేట సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ వద్ద వినాయకునికి బెలూన్లతో అలంకారం



జవ్వారుపేటలోని వెంకటేశ్వర స్కూల్ వద్ద గణనాథునికి చీరలతో అలంకారం

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్, న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజల కోసం ఉచిత న్యాయసేవలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించబడిందని, ఈ యాప్ ద్వారానే న్యాయసేవలను పొందవచ్చునన్నారు.

న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందిస్తారని చెప్పారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ కె. ఆదినారాయణ మాట్లాడుతూ తమ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందిస్తున్న సేవలతో పాటు న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను అవసరమైన వారు పొందవచ్చునన్నారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, పోస్టల్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వెంకటేశ్వరరావుకు నివాళి



చల్లపల్లి: వైఎస్సార్ సీపీ సీనియర్ ఎస్సీ నాయకులు, ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ క్యాషియర్, అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా నాయకులు మేరుగు వెంకటేశ్వరరావు శుక్రవారం తెల్లవారుఝామున కోమలా నగర్‌లోని తన నివాసంలో మృతిచెందారు. ఆయన గుండెపోటుకు గురికాగా, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. వెంకటేశ్వరరావు ఇండియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘ నాయకులుగా సేవలు అందించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారులు రాజేష్, రమేష్ వైఎస్సార్ సీపీ నాయకులుగా సేవలు అందిస్తున్నారు. పెద్ద కోడలు మేరుగు ఝాన్సీలక్ష్మి ఏపీ అగ్రికల్చర్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవ చేస్తున్నారు.

ఎమ్మెల్యే సింహాద్రి నివాళి

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అసెంబ్లీ సమావేశాల నుంచి నేరుగా చల్లపల్లి కోమలా నగర్ చేరుకుని వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వెంకటేశ్వరరావు భౌతిక కాయాన్ని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వేమూరి గోవర్ధనరావు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, నాయకులు రాజులపాటి శివప్రసాద్, కేశనకుర్తి శరత్‌బాబు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

లక్ష్మీదేవికి సామూహిక కుంకుమ పూజ



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

నాగాయలంక: గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న 66వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవ పందిరిలో 150 మందికి పైగా మహిళలచే 108 లక్ష్మీదేవి కలశాలకు సామూహిక కుంకుమ పూజ కనుల పండువగా నిర్వహించారు. పురోహితుడు కూరపాటి రాధాకృష్ణమూర్తి పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీలక్ష్మీ అమ్మవారి ప్రధాన పీఠం వద్ద ఆర్యవైశ్య సంఘం నాయకుడు మానేపల్లి మురళీకృష్ణ, వరలక్ష్మి దంపతులచే ప్రధాన పూజాక్రతువు జరిపారు. గురువారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ నాగాయలంక, పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు ఉత్సవ పందిరిలో బారులు తీరి కుంకుమ పూజను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. క్లాత్ మర్చంట్స్ నేతలు గోలి సత్యనారాయణ, హరిప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో బహూకరించిన బంగారు పూత వెండి లక్ష్మీరూపులను ప్రసన్న గణపతి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా 600 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. తౌలుత శర్మ అర్చకత్వంలో ప్రసన్న గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు, ద్వాదశ హారతులు నిర్వహించారు. సంకర్షణ భజన మండలి సభ్యులచే సామూహిక విఘ్నేశ్వర సహస్రనామం, శ్రీలక్ష్మీ సహస్రనామ స్తోత్ర పారాయణం జరిగింది. అనంతరం తలశిల జనార్ధనరావు ఆర్థిక సహకారంతో భాగవతారిణి పి.విజయలక్ష్మి (రాజమండ్రి) రుక్మిణీ కల్యాణం హరికథా గానం చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారంపై హర్షం

గూడూరు: గూడూరులో అపరిష్కృతంగా ఉన్న రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం కావడంపై గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని రీ సర్వే నంబరు 393–1లోని 260 ఎకరాల్లో గత ఏడేళ్లుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంపై గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను గుర్తించి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్‌కు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు: 33 కేవీ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ గూడూరు మండల ఏఈ ఎం.రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని మల్లవోలు, ముత్రాసిపాలెం, పోలవరం, ఐదుగుళ్లపల్లి, రామన్నపేట, రాయవరం గ్రామాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ముమ్మరంగా జగనన్న సురక్ష వైద్య సర్వే

పెడన: పట్టణంతో పాటు మండలంలో జగనన్న సురక్ష వైద్య సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెలాఖరులోగా పూర్తి చేసి అక్టోబర్‌లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందించాలనే దృఢ సంకల్పంతో సర్వే వేగంగా జరుగుతోంది. ఏఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్ పరీక్షలు చేసి వివరాలను నమోదు చేస్తున్నారు. ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి వివరాలను నమోదు చేస్తున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. శుక్రవారం పలు వార్డులలో కౌన్సిలర్లు సర్వేలో పాలుపంచుకున్నారు. నాలుగో వార్డు కౌన్సిలర్ రెహమతున్నీసా, ముత్యాల మురళి పాల్గొన్నారు.

వర్గీకరణకు సహకరించాలని వినతి

మోపిదేవి: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు కొక్కిలిగడ్డ సువర్ణరాజు తహసీల్దార్ కె. నవీన్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి తమ ఎంపీలతో పార్లమెంట్‌లో మాట్లాడించాలని కోరారు. కొక్కిలిగడ్డ నవీన్, మట్టా వంశీ, కొల్లూరి జ్యోతిబాబు, బందెల కిట్టు, బందెల చిన్ను, ప్రదీప్, చావల సందీప్, పరిసే అశోక్ పాల్గొన్నారు.

బిషప్ పరిశుద్ధబాబు అంత్యక్రియలు

మచిలీపట్నంటౌన్: ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ ఫౌండర్, డైరెక్టర్ బిషప్ గాడెల్లి పరిశుద్ధబాబు అంతిమయాత్ర శుక్రవారం నిర్వహించారు. లక్ష్మణరావుపురంలోని ఆయన నివాసం నుంచి మండల పరిధిలోని కొత్తపూడిలో ఉన్న ఫెయిత్ టెంపుల్ చర్చి ఆవరణ వరకు అంతిమయాత్ర సాగింది. అనంతరం మట్టి కార్యక్రమాన్ని చేశారు. అంతిమయాత్రలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జాని), పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పాస్టర్లు, క్రైస్తవులు, ఫెయిత్ టెంపుల్ మినిస్ట్రీస్ పాస్టర్లు పాల్గొన్నారు.